మాతా వైష్ణవి దేవి ఆలయానికి

రెండు వాహనాలు అందించిన వేమిరెడ్డి దంపతులు

కోవూరు, మార్చి 26 ప్రభాతవార్త : నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు జమ్మూ కాశ్మీర్‌లోని కట్రాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మాతా వైష్ణవి దేవి అమ్మవారికి గురువారం రెండు వాహనాలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయంలో వివిధ అవసరాల నిమిత్తం అధికారులకు రెండు వాహనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనల మేరకే పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 26, ప్రభాతవార్త జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనల మేరకే పనిచేసేలా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరు వారి ఛాంబర్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి (పిఎన్‌డిటి), సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (ఏఆర్‌టి) అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టీబీ ముక్తభారత్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి. సుజాత, డిఐఓ డాక్టర్ ఏ. ఉమామహేశ్వరి, అడిషనల్ డిఎంఅండ్ హెచ్వో ఖాదర్ వలీ, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆండాళ్ భాస్కర్, సిఐ కృష్ణారెడ్డి, డెమో కె. కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టండి

- జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా

నెల్లూరు అగ్రికల్చర్, మార్చి 26, ప్రభాతవార్త భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా అధికారులకు సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి జరిగే పరిశీలనలో భాగంగా గురువారం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ వీఎంలు భద్రపరిచిన మూడు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించి కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం సీసీ కెమెరాల నిఘా కొనసాగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాసులు, సంజయ్, బాల సుధాకర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, అర్బన్ తహసీల్దార్ షఫీ మాలిక్, ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, ఎలక్షన్ డీటీలు ఆషర్, అశోక్, ఈడీటీ జమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్ ఆదునీకరణ పనులను పరిశీలించిన కమిషనర్

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 26 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ నగర పర్యటనలో భాగంగా 37వ డివిజన్ ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న అంబేద్కర్ భవన్‌లో జరుగుతున్న అధునీకరణ పనులను అదికారులతో కలసి గురువారం తనిఖీ చేశారు. పనులన్నింటిని నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేసి అంబేద్కర్ భవన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురంలో ఘోర ప్రమాదం

- ఆరిపోయిన నిరుపేదల ఆశాదీపాలు

వింజమూరు, మార్చి 26, ప్రభాతవార్త మార్కాపురం సమీపంలో రాయవరం వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం ప్రతి ఒక్కరిని కలిచివేసింది. రెక్కాడితేడొక్కాడని సామాన్య కూలీల జీవితాలు మంటల్లో కలిసిపోవడం అత్యంత విషాధకరం. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ రాష్ట్రం నుండి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో కలిగిరికి గురువారం తెల్లవారుజామున ఆశలతో వస్తున్న ప్రయాణం అర్ధాంతరంగా అగ్ని గోళంలో ముగిసిపోయింది. పొట్ట కూటి కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లి తిరిగి సొంత గూటికి చేరుకుంటున్న వేళ మృత్యువు టిప్పర్ రూపంలో వచ్చి బస్సును ఢీకొనడంతో వారి జీవితాలు చిన్నభిన్నమయ్యాయి. నియోజకవర్గంలో కలిగిరి మండలం నాగసముద్రం పంచాయతీకి చెందిన ఆత్మకూరు చిన్న(45) ఈ బస్సు ప్రమాదంలో మృతి చెందారు. చిన్నాకు భార్య, 5 మంది కుమార్తెలు ఉన్నారు. వారిని ప్రయోజకులను చేయాలని భార్యను భాగా చూసుకోవాలని చిన్న తెలంగాణకు వెళ్లి బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు . శ్రీరామనవమి పండుగకు తండ్రి వస్తున్నాడని ఆశగా ఎదురు చూసిన ఆ చిన్నారులకు ఇప్పుడు ఆ తండ్రి భౌతిక కాయం కూడా దక్కని స్థితిలో సజీవ దహనం కావడం వర్ణణాతీతం. ఆ కూతుర్ల రోదనలు చుట్టుపక్కల వారిని సైతం కన్నీరు పెట్టిస్తున్నాయి. అలాగే కొండాపురం మండలం తూర్పు ఎర్రబల్లి ప్రాంతానికి చెందిన నర్సింగ్ ప్రభావతి కుమార్తె చైత్ర కన్నతల్లితో పాటు ఈ మంటల్లో బూడిద అవడం అత్యంత దారుణం. లోకం తెలియని చిన్నారి ప్రాణాలు గాలిలోనే కలిసిపోవడం మృత్యు ఎంత క్రూరమైందో ఈ సంఘటన చెప్తుంది. ఉదయగిరి మండలం దాసరపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఈ ఘటనలో మృతిచెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి వేదన పడ్డది. అలాగే మండలంలోని నల్గొండ గ్రామానికి చెందిన తలపల సురేంద్ర, భార్య చందన కుమార్తె వైష్ణవి కుమారుడు చందులు ఈ బస్సు ప్రమాదంలో మృత్యువు అంచున వరకు వెళ్లి బ్రతికి గాయాలతో బయటపడ్డారు. గాయాలైన వారిని ఒంగోలులో ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే వింజమూరు పంచాయతీ పరిధిలోని మోటా చింతలపాలెం గ్రామానికి చెందిన సుజాత, మనోజ్, మేఘన, ఉదయగిరి మండలం ఐనవారిపల్లి గ్రామానికి చెందిన కోసినపోగు ప్రకాష్‌లు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నప్పటికి కళ్ళ ఎదుట జరిగిన మారణహోహాన్ని తెలుసుకుని వణికిపోతున్నారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అయితే మరణించిన వారి కుటుంబాలలో ఎక్కువ మంది నిరుపేదలే కావడం ప్రభుత్వం తక్షణమే స్పందించి గరిష్ట స్థాయిలో సహాయమందించి ఆ చిన్నారులు భవిష్యత్తుకు భరోసా కల్పించాలని మానవతావాదులు కోరుకుంటున్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 26, ప్రభాతవార్త మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై బాధితుల సహాయార్థం నెల్లూరు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు, చేసినట్టు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఓ ప్రకటనలో తెలిపారు నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో 7995576699, 08612331261 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లాకు సంబంధించిన 15 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు సమాచారం అందడంతో ప్రమాదానికి సంబంధించి వివరాల కోసం పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

అభివృద్ధే మా అజెండా మంత్రి నారాయణ

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త-వైద్యం : అభివృద్ధే తన అజెండా అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. జూన్ పన్నెండుకల్లా సిటీ లో చేపట్టిన అభివృద్ధిపనులు పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను అనుభవంతో సీఎం చంద్రబాబు నాయుడు సరిచేస్తున్నారన్నారు. నెల్లూరు నగర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గురువారం మంత్రి నారాయణ చేపట్టిన పర్యటన అత్యంత ఉత్సాహంగా సాగింది. సీఆర్సీ డొంకలో నారాయణ నేత్రజ్యోతి దంత సురక్షఖి ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన మంత్రి, అక్కడ కంటి పరీక్షలు చేయించుకున్న 12 మందికి అద్దాలను పంపిణీ చేశారు, రాబోయే రెండేళ్లలో 48 వేల మందికి కంటి పరీక్షలు చేయడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం సిటీ నియోజకవర్గంలో కొనసాగుతున్న పార్కుల జాతరఖిలో భాగంగా 8వ డివిజన్‌లో 85 లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన పొట్టిశ్రీరాములు పార్కును ప్రారంభించారు.ఈ సందర్భంగా పార్కులో జిమ్ చేసి అందరినీ ఉత్సాహపరచడమే కాకుండా, చిన్నారులతో ఆటలాడించి ,వారికి చాక్లెట్లు పంపిణీ చేసి పండగ వాతావరణం నింపారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతుందని, నెల్లూరు కార్పొరేషన్ అభివృద్ధికి 850 కోట్ల నిధులు కేటాయించామని స్పష్టం చేశారు. నగరంలో 50 వేల చెట్లు నాటి గ్రీన్ సిటీగా మార్చడమే కాకుండా, త్వరలోనే భారీ అడ్వెంచర్ పార్క్, వాటర్ స్పోర్ట్స్ పార్క్ ఏర్పాటు చేస్తామని, 15 ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామన్నారు. మార్కాపురం బస్సు ప్రమాద ఘటన బాధాకరమన్నారు. మృతులకు 5 లక్షల పరిహారాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. గాయపడ్డ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, మాజీ మున్సిపల్ చైర్పెర్సన్ తాళ్ళపాక అనురాధ,మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ,టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి ,సిటీ మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి,డివిజన్ కో క్లస్టర్ హేమంత్ కుమార్ ,ప్రెసిడెంట్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

మత్స్యకారుల భరోసాకై ఏప్రిల్ 2 న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ జువ్వలదిన్నె రాక

వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కాకాణి వెల్లడి

బిట్రగుంట మార్చ్ 26 ప్రభాతవార్త మత్స్యకారుల సమస్యలపై పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, వారికి భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలకు అండగా ఉండేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏప్రిల్ 2 వ తేదీన జువ్వలదిన్నె తీర ప్రాంతానికి రానున్నారని వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లు, పరిశీలించేందుకు ఆయన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ తులసి రఘురాం, కావలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు.

కాకాణి గోవర్ధన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ

మత్స్యకారుల హక్కులు, వారి జీవనోపాధికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఈ పర్యటన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

❖ జువ్వలదిన్నె వద్ద మత్స్యకారుల కోసం నిర్మించాల్సిన చేపల నౌకాశ్రయం కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, అందులో 29.5 ఎకరాలను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు . మత్స్యకారుల కోసం కేటాయించిన భూమిలో భాగాన్ని ప్రైవేట్ సంస్థకు ఇవ్వడం ద్వారా వారి హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

❖ అలాగే సముద్ర సంపదను అక్రమంగా దోచుకుపోతున్న తమిళనాడుకు చెందిన పడవలను ఎనిమిది నెలల క్రితం నిర్బంధించినప్పటికీ, తరువాత వాటిని వదిలేయడం వెనుకఎవరి హస్తం ఉందో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు ఈ విషయంపై మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు

❖ మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు . రాజకీయాలకతీతంగా మత్స్యకారుల శ్రేయస్సు దృష్ట్యా వారికి తాము అండగా నిలుస్తామని చెప్పారు. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదని వైసీపీ హయాంలో 283 కోట్ల రూపాయలతో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ లో భూములు ప్రైవేటు వ్యక్తుల కేటాయించడాన్ని తాము తప్పు పడుతున్నామని, పరిశ్రమలకు మరోచోట ఇదే చోట వేరే ప్రాంతంలో కేటాయిస్తే తమకు అభ్యంతరం లేదని ఇంకా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తమ పార్టీ అభిప్రాయం అన్నారు.

శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి ఒక్కో రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పి పి విధానాల్లో తీసుకురావడానికి తాము వ్యతిరేకించామన్నారు ఇప్పుడు పోర్టును కూడా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే యత్నాన్ని తాము ప్రతికటిస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు యాదవ్ నియోజకవర్గ మండల నేతలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఘనంగా స్వర్ణ రథోత్సవం

- పాల్గొన్న శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త-వైద్యం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు గురువారం స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి పాల్గొని రథాన్ని లాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆరుద్రోత్సవంలో భాగంగా తెల్లవారుజామున శివుడికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా చేపట్టారు. ఉత్సవంలో భాగంగా కళా బృందాలు కోలాటం, తప్పెట నృత్యాలు లాంటి పలు జానపద కళారూపాలు నిర్వహించారు. రథోత్సవ వేడుకలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు, కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణాలను తనిఖీ చేసిన కమిషనర్ వైఓ.నందన్

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 26 ప్రభాతవార్త : నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ నగర పర్యటనలో భాగంగా 27వ డివిజన్ రిత్విక్ ఎంక్లేవ్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను గురువారం టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో కలసి ఆకస్మికంగా తనికీ చేశారు. నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారు మంజూరు చేసిన అనుమతులు మేరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయా, అతిక్రమించి నిర్మిస్తున్నారా అని స్వయంగా పరిశీలించారు. సచివాలయం పరిధిలోని నూతన భవన నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమతులు మేరకు నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్లానింగ్‌విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు టిపిబిఓలు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్ ఇండియా 22వ ర్యాకంఉ సాధించిన సార్వికకు ఘనసత్కారం

కావలి, మార్చి 26 ప్రభాతవార్త : ఇటీవల విడుదల అయిన గేట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 22వ ర్యాంకు సాధించి సత్తాచాటిన మద్దూరుపాడులో నివాసం ఉంటున్న కాంగ్రా సార్వికను బిజెపి ఆద్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కుట్టు బోయిన బ్రహ్మానందం మాట్లాడతూ బోగోలు మండలం నాగులవరంకు చెందిన కాంద్ర శ్రీనివాసులు, లక్ష్మి ప్రసన్నల కుమార్తెల సార్విక పట్టుదలతో చదివి గేట్ పరీక్షల్లో 22వ ర్యాంకు సాధించి నందుకుసంతోషంగా ఉందన్నారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు తమ కుమార్తె ఈ ర్యాంకు సాధించడంపై సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షులు వీరాల శ్రీనివాసులుయాదవ్, మంద కిరణ్‌కుమార్, యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిన న్యాయవాది గుర్రంకొండ సర్దార్

కావలి, మార్చి 26 ప్రభాతవార్త : న్యాయవాది గుర్రంకొండ సర్దార్ కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆళహరి సుధాకర్ సర్దార్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనపార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెలుతానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి ఈ బాద్యతలను అప్పగించినందుకు పార్టీకి ఎల్లవేలాలా అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయనకు దుశ్శాలాతో ఘనంగా సత్కరించారు.

గేట్ పరీక్షల్లో జాతీయస్థాయిలో 79వ ర్యాంకు సాధించిన నారాయణ పూర్వ విద్యార్థి

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త-విద్య : జాతీయస్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గేట్ ఫరీక్షా ఫలితాల్లో నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ ఐఐటి(నరసింహస్వామి కొండ క్యాంపస్)లో 2015,17 చదువుకున్న పూర్వవిద్యార్థి మేడగిరి శ్రీకాంత్ 79వ ర్యాంకును కైవశం చేసుకుని సత్తా చాటాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు. ఈ సంర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతు తమ పూర్వవిద్యార్థి 2026లో నిర్వహించిన గేట్ ఫలితాల్లో ఇంతటి విజయాలు సాధించగటం గర్వకారణమన్నారు. 9 సంవత్సరాల తరువాత కూడా శ్రీకాంత్ తాను చదివిన నారాయణ విద్యాసంస్థలకు వచ్చి ఉపాధ్యాయుల ఆశీర్వచనాలు తీసుకోవటం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో శ్రీకాంత్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీన్ డివిఆర్, ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో బోట్ల నియంత్రణకు గస్తీ ముమ్మరం

ఎస్ఐ శివసౌమ్య

కోట, 26 ప్రభాతవార్త కోట మండలంలోని సముద్ర తీర ప్రాంతాల గ్రామాల్లో తమిళనాడు బోట్ల నియంత్రణకు గస్తీ ముమ్మరం చేసినట్లు దుగ్గరాజ పట్నం మెరైన్ ఎస్ఐ.శివసౌమ్య చెప్పారు. గురువారం మండల పరిధిలోని కొత్తపట్నం గ్రామ పంచాయతీలోని పెద్దగొవిందపాళెం లో మత్యకారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమిళనాడు బోట్ల రాకుండా ఉండేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటందన్నారు. పెద్ద కాపు మస్తానయ్య మాట్లాడుతూ పాండిచేరి బోట్ల సముద్రంమీదగా వస్తున్నాయని వివరించారు. ఎస్ఐ శివ సౌమ్య మాట్లాడుతూ ఇక మీదట అలా జరగదన్నారు.సముద్రం మీద గస్తీ కొరకు ఒక పెద్ద బోటు మెరైన్ సిబ్బంది పరేవ్యేకిస్తుందని పేర్కొన్నారు.నిత్యం 24 గంటల పాటు సముద్రం మీద గస్తీ ఉంటుందని వివరించారు. ఈకార్యక్రమంలో అటవీశాఖ అధికారులు శ్రీనివాసులు, ఎఎస్ఐ.ఏడుకొండలు, పంచాయతీ కారదర్శి రావమ్మ, హెడ్ కానిస్టేబుల్ బెల్లంకొండ శ్రీనివాసులు, మత్స్యకారులు తదితరుల పాల్గొన్నారు.

మొండి బకాయిదారుల గృహాలకు స్వయంగా వెళ్లి పన్ను వసూళ్కు చేసిన కమిషనర్

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 26 ప్రభాతవార్త : నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ స్థానిక 27వ డివిజన్ చంద్రమౌళి నగర్, రిత్విక్ ఎంక్లేవ్, నిప్పోజీఎన్‌టిరోడ్డు పరిసరాల్లోని మొండి బకాయిదారుల గృహాలకు గురువారం స్వయంగా వెళ్లి పన్ను వసూళ్కు కార్యక్రమాన్ని చేపట్టారు. నగరపాలక సంస్థకు గత కొంతకాలంగా చెల్లించని బకాయిలను తప్పనిసరిగా నిర్దేశించిన సమయంలోపు చెల్లించాలని యజమానులకు కమిషనర్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుకు కేవలం 5రోజులు మాత్రమే ఉందని ప్రభుత్వం ప్రకటించిన 50శాతం వడ్డీరాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు పన్నుల వసూళ్పే ఆధారమని నిర్దేశించిన సమయానికి పన్నులను బాద్యతగా చెల్లించి నగరపాలకసంస్థకు సహకరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో నగరపాలకసంస్థ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్ పెక్టర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

నెల్లూరు క్రైమ్, మార్చి 26, ప్రభాతవార్త: జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల గురువారం ఒక ప్రకటనలో శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ధర్మానికి, న్యాయానికి ప్రతీక అని, ఈ పండుగ మనకు ధర్మాన్ని ఎలా ఆచరించాలో సందేశం ఇస్తుందని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో, చలువ పందిళ్ల మధ్య శ్రీరామనవమి వేడుకలను ప్రజలందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రధాన రామాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలపై ఉపాధ్యాయులు ప్రచారం చేయాలి

కోట, మార్చి 26 ప్రభాతవార్త : ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలపై గ్రామాల్లోని ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంఇఒ-2 మస్తానయ్య కోరారు. ఆయన గురువారం తన కార్యాలయంలో 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి పరీక్షలు జరుగుతాయని, పరీక్షలు ముగిసిన అనంతరం మండలంలోని ఉపాధ్యాయులు వారి పరిధిలో విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తుందన్నారు. మెనూలో మార్పులతో ఎక్కువమంది భోజనం చేస్తున్నారని అన్నారు. భోజనం మరింత రుచిగా వడ్డించేలా ప్రత్యేక పర్యవేక్షణను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నామినేట్ చేసిన ఉపాధ్యాయులు రోజూ భోజనం చేసి బాగుందని భావించాకే విద్యార్థులకు వడ్డించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రభుత్వం విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బాగా ప్రచారం చేసి విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు.

బస్సు ప్రమాదంలో 13 మంది మృతి చెందటం అత్యంత బాధాకరం

- ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త -వైద్యం : మార్కాపురం జిల్లాలోని రాయవరం వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రయాణికుల్లో 13 మంది సజీవ దహనం కావడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ విషాద సమయంలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు. క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని స్పష్టం చేశారు.

రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి ఆనం

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త–వైద్యం : మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్‌ను ప్రైవేటు బస్సు ఢీకొనడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరం అన్నారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవ దహనం కావడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఆనం అన్నారు.

బస్సు ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మేకపాటి

వింజమూరు, మార్చి 26, ప్రభాతవార్త : ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బస్సు ప్రమాదంలో నియోజకవర్గానికి చెందిన నలుగురు మరణించడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. గురువారం ఉదయం జగిత్యాల నుండి కలిగిరికి వస్తున్న హరికృష్ణ ప్రైవేటు ట్రావెల్స్ బస్ మార్కాపురం సమీపంలో సజీవదహన ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాలకి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద సమయంలో బస్‌లో ఉదయగిరి నియోజకవర్గంకి సంబంధించి వింజమూరు, కలిగిరి, కొండాపురం, ఉదయగిరి మండలంకి చెందిన ప్రయాణికులు ఉన్నారని, ప్రమాదంలో ఉదయగిరి మండలం దాసరిపల్లి బీసీ కాలనీకి చెందిన ముతంగి వెంకటేశ్వర్లు, కలిగిరి మండలం బొమ్మరాజు చెరువుకి చెందిన ఆత్మకూరు చిన్న, కొండాపురం మండలం తూర్పు ఎర్రబల్లికి చెందిన నర్సింగ్ ప్రభావతి, ఆమె కుమార్తె చైత్ర మరణించినట్లు సమాచారం ఉందని, కనుక ప్రభుత్వం మరణించిన ఒక్కొక్క మృతుని కుటుంబంకి ప్రభుత్వం రూ.50లక్షల ఆర్థిక సహాయం అందించాలని, క్షతగాత్రులను కూడా పూర్తి బాధ్యత తీసుకుని ప్రభుత్వమే వారికి మెరుగైన వైద్యం అందించాలని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఈ సందర్భంగా కోరారు. ప్రమాదం ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రవాణా అధికారులు ఖచ్చితమైన తనిఖీలు చేపట్టి ఫిట్ నెస్‌లేని వాహనాలు నివారించాలని ఇటువంటి దురదృష్ట సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కిసాన్ గోష్టి ద్వారా రైతులకు శిక్షణ - ఏడీఏ అని

విడవలూరు, మార్చి 26 ప్రభాతవార్త : మండ లంలోని ఊటుకూరు గ్రామంలో రైతులకు 'ఆత్మ' ఆధ్వర్యంలో కిసాన్ గోష్టి రైతు శిక్షణా కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోవూరు ఏడీఏ జి. అనిత హాజరై రైతులకు పంటల సాగు విధానాలపై మార్గదర్శనం చేశారు. వేరుసెనగ పంటలో రక్షక పంటలైన సజ్జ, ఎర పంటలైన ఆముదం, బంతి మొక్కలను పరిశీ లించి వాటి ప్రాముఖ్యత నువివరించారు. రాబోయే సీజన్‌లో టీసీజీఎస్1694 విశిష్ట వేరుసెనగ రకాన్ని ఎఫ్ పి ఓ కలిగిరి ద్వారా రైతులకు అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీఎస్ మొబైల్ యాప్‌లో నమోదు చేసుకుని విశిష్ట రైతు సంఖ్య పొందాలని కోరారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ కుమార్ రెడ్డి, రైతు కొమర వెంకయ్య పొలంలో సాగుచేసిన టీసీజీఎస్1694, కోణార్క్, టి ఏ జి 24 వేరుసెనగ రకాల పంటలను పరిశీలించి, వాటి దిగుబడులను అంచనా వేశారు. ఇందులో టీసీజీఎస్1694 రకం సంతృప్తికర దిగుబడి ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఏఓ సిహెచ్ఎస్ లక్ష్మీ ్మ, వి ఏ ఏ ప్రవీణ్, చెంచులక్ష్మి ్మ, ప్రత్యూష మరియు రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త–వైద్యం : మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు దగ్ధమై ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. బస్సు ప్రమాదంలో గాయపడిన పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కోలుకుంటున్న క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాదానికి గల కారణాలను ప్రభుత్వం లోతుగా విచారిస్తోందన్నారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిందన్నారు.

హరికృష్ణ ట్రావెల్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన కలిగిరి వాసులు

కలిగిరి,మార్చి 26 ప్రభాతవార్త మార్కపురం వద్ద హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో కలిగిరి మండలానికి చెందిన పలవురు మృతి చెందారు. మండలంలోని జిరావారిపాలెంకు చెందిన హరికృష్ణ ట్రావెల్ బస్సులను కలిగిరి నుండి హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు ట్రావెల్స్ నడుపుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణాలోని జగిత్యాల నుండి కలిగిరికి ప్రయాణికులతో వస్తున్న క్రమంలో టిప్పర్ ఢీకొని బస్సులో మంటలు చెలరేగి 13 మంది చనిపోయినట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో కలిగిరి మండలం, బొమ్మరాజు చెరువుకి చెందిన ఆత్మకూరు శ్రీను(45) అనే వ్యక్తి జగిత్యాల వద్ద బేల్దారు పనులకు వెళ్లి శ్రీరామనవమి పండుగకు ఇంటికి వస్తూ మార్కపురం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందారు. మృతునికి భార్య, ఐదు మంది పిల్లలు వున్నారు. వీరంతా మృతునిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు ఈ ప్రమాదంతో ఆ ఇంట విషాదం నెలకొంది. మండలంలోని ఎర్రబెల్లికి చెందిన నర్సింగ్ శ్రీను కుటుంబ మార్కాపురం వద్ద నివాసం వుంటూ బేల్దారు పనులు చేసుకోని జీవనం సాగిస్తున్నారు. ఇతనికి భార్య, పిల్లలు వున్నారు. శ్రీను భార్య ప్రభావతి(30), వారి బంధువల పాపను సాకుకుంటుంది. ప్రభావతి హైదరాబాదుకు వెల్లి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదంలో మృతి చెందింది. ప్రభావతితో పాటు ఆమె పెంపుడు పాప(5),చైత్ర కూడా మంటల్లో మృతి చెందింది. మండలంలోని గరవెనపెంట పంచాయితీలోని ఓ వ్యక్తి కూడా ఇదే ప్రమాదంలో బయటపడి సజీవంగా వున్నారు. దీనిపై అధికారులు లోతైన దర్యాపునత చేస్తున్నారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా అదుకుంటామని ఇప్పటికే ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆయన తన సానుభూతిని ప్రకటించారు.

వైభవంగా అన్నదానం

కోవూరు, మార్చి 27 ప్రభాతవార్త : కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం పర్వదినం సందర్భంగా ప్రాత: కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దాసరిరాజు హిమవతి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పచ్చిపాల సుజాత, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికా ర్జునరెడ్డి, భక్తులు ఉన్నారు.

ఆవాజ్ 3వ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కర

నెల్లూరు సిటీ, మార్చి 26, ప్రభాతవార్త : ఆవాజ్ 3వ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నగరంలోని ఆవాజ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఆవాజ్ వ్యవస్థాపక సభ్యులు షేక్ రియాజ్, సీనియర్ నాయకులు జానీ బాషాలు లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ ఆవాజ్ 3వ రాష్ట్ర మహాసభలకు నెల్లూరు జిల్లా ఆతిథ్యం ఇవ్వనందన్నారు. 2002లో ఏర్పడిన ఆవాజ్ మైనారిటీ డెవలప్మెంట్ ఫోరం రాష్ట్ర మహాసభలు మొట్టమొదటిసారి మతసామరస్యానికి, లౌకికత్వానికి నిదర్శనమైన నెల్లూరులో జరపడం చాలా సంతోష దాయకమన్నారు. అభివృద్ధి, భద్రత, లౌకికత్వం అంశాలపై ఆవాజ్ గత 23 సంవత్సరాలుగా పనిచేస్తుందని అందులో భాగంగా జిల్లాలో కూడా ఎన్నో సమస్యలకు పరిష్కారం మార్గాలను చూపడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో కూడా ఆవాజ్ మరింతగా చురుకుగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంలో రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరుగుతున్న సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ తమ సహాయ, సహకారాలు అందించి రాష్ట్ర మహాసభలు విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. యస్దాన్ భాష, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ అహ్మద్, జిల్లా కోశాధికారి మహమ్మద్ సర్దార్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒడ్లుపోట్టు రావడంతో ఇబ్బందులు పడుతున్నా గ్రామస్థులు

కోట,మార్చి 26 ప్రభాతవార్త : కోట మండలంలోని వెంకన్నపాళెం గ్రామ పంచాయతీలోని వీరారెడ్డి సత్రం వద్ద ఉన్న రైస్ మిల్లు నుంచి నిత్యం ఒడ్లుపోట్టు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రామస్థులు గురువారం తహిసీల్దార్,కె.జయజయరావుకు పిర్యాదు చేశారు.పొట్టు కళ్లల్ల పడుతోందని దీంతో కంటి చూపు దెబ్బతింటుందని వారు వాపోయ్యారు.పొగ, పోట్టుతో తాము అనేక సంవత్సరాల నుంచి ఇబ్బంది పడుతున్నామని తహిశీల్దార్‌కు వివరించారు.విచారించి చర్యలు తీసుకొంటామని తహిశీల్దార్ జయ జయ రావు చెప్పారు.

29న శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సదస్సును జయప్రదం చేయండి

నెల్లూరు అగ్రికల్చర్, మార్చి 26, ప్రభాతవార్త : మహిళా కార్మిక చట్టాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని శ్రామిక మహిళా నేతలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఎస్‌కే రెహానా బేగం ఆరోపించారు. గురువారం వారిరువురు నెల్లూరులోని సీఐటీయు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 29న నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ, ఉద్యోగ రంగాలలో ఉన్న మహిళలకు రుతుక్రమ సమయంలో మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో పని చేస్తున్న మహిళా కండక్టర్లు దశల వారీగా ఆందోళన చేపట్టిన క్రమంలో వారికి మూడు రోజులు సెలవు దినాలను ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళలపై లైంగిక వేదింపులు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం విచారణ కమిటీలు పెట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం పట్ల గరికపాటి నరసింహారావు వ్యాఖ్యలు సరికాదని, వెంటనే ఆయన ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న నిర్వహించే శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సదస్సులో ఆశా వర్కర్లు, బీడీ కార్మికులు తదితర రంగాల నుంచి అధిక సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.మధుసూదన, బీడీ కార్మిక సంఘం నాయకురాలు ఎస్‌కే శంషాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

113మంది పిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్లు

కలిగిరి,మార్చి 26 ప్రభాతవార్త : ప్రాథమిక వైద్యకేంద్రములో ఇప్పటివరకు 113మంది పిల్లలకుహెచ్‌పివి వ్యాక్సిన్లను ఇవ్వడం జరిగిందని కలిగిరి, ప్రాథమిక వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి తెలిపారు.అయితే వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు గీతారెడ్డి తెలిపారు. అందువల్ల ప్రజలు హెచ్‌పివి వ్యాక్సిన్ వల్ల ఎటువంటి అపోహాలు పడవద్దని తెలిపారు .ఇకపై కూడా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకోసం పిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించాలని కలిగిరి పిహెచ్‌సి వైద్యాధికారులు తెలిపారు.

కొమారి శ్రీనివాసులకు నివాళులర్పించిన బీసీ నాయకులు

కావలి, మార్చి 26 ప్రభాతవార్త : కావలి నియోకవర్గ బీసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొమారి శ్రీనివాసులు ఉత్తర క్రియలు కార్యక్రమం గురువారం రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగింది. ఈ సందర్బంబగా బిసి ఐక్యత భవన్ నాయకులు పాలొగన్నారు. ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా శ్రీనివాసులు అనేక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని బిసీల ఉనికిని చాటడంలో కీలకపాత్ర పోషించారన్నారు. మొట్టమొదటగా సంక్షేమసంఘాన్ని స్థాపించి చైతన్యం తెచ్చిన ఘటన ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట సీనియర్ నాయకులు కొమారి రాజు, బీసి ఐక్యత భవన్ సీనియర్ అడ్వకేట్ ఐ.సాయిప్రసాద్, బిసి ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉరిటి గోవిందు బిసి ఐక్యత భవన్ అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌రావు, కావలి కుమ్మర సంఘం ఇన్‌చార్జ్ బెజవాడ అభిసాగర్ ప్రజాపతి బిసి నాయకులు పాల్గొన్నారు.

రామయ్య మము కరుణించయ్యా

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త – వైద్యం శ్రీరాముడి జీవితం అందరికి ఆదర్శమని, శ్రీరామనవమి విశిష్టతను భావితరాలకు తెలియజేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. నెల్లూరులోని రెడ్ క్రాస్ సొసైటీ స్పాస్టిక్ సెంటర్లో శ్రీరామనవమి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాముల వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం శ్రీరాముడి నామస్మరణలో మనందరం ముందుకెళ్లాలన్నారు. ఆయన నామస్మరణతో శ్రీరామనవమికి పుడమి పులకించిపోతుందన్నారు. స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయగిరి భాస్కర్ మాట్లాడుతూ చిన్నారులకు వారి తల్లిదండ్రులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. అందరికి ఆ శ్రీరాముల వారు సీతమ్మ దయతో అన్ని శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పాస్టిక్ సెంటర్ చిన్నారులు, వారి తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో పని చేసే ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లకు పదోన్నతులేవి..?

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త –వైద్యం : నెల్లూరులోని వెన్నెల ఐస్ క్రీమ్ ఫంక్షన్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో ఫార్మసీ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు జీవిత కాలం సర్వీస్ చేసి పదోన్నతులు లేకుండానే రిటైర్డ్ అవుతున్నారని, పదోన్నతుల విషయంలో జరుగుతున్న నష్టాన్ని గుర్తించి సకాలంలో పదోన్నతులు కల్పించే విధంగా ఉన్నతాధికారులు చూడాలన్నారు. మంచిగా విధులకు హాజరవుతూ నీతి నిజాయితీగా సేవలందిస్తూ అవినీతికి దూరంగా ఉండే అధికారులను ఉద్యోగులను మాత్రమే ఏపీ హంస అసోసియేషన్లో కొనసాగించడం జరుగుతుందని, అలాంటి వారిని మాత్రమే స్వాగతిస్తున్నామన్నారు. అనంతరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నెల్లూరు నందు పేద ప్రజలకు గొప్పగా సేవలు అందిస్తూ మహిళా ఉద్యోగ సంఘ నాయకురాలుగా ఏపీ హంస నెల్లూరు రూరల్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తూ ఏసీఎస్ ఆర్ గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ నర్సింగ్ ట్యూటర్ గ్రేడ్-2 గా పదోన్నతి పొందిన బి.జయలక్ష్మీ ని ఏపీ హంస జిల్లా సెక్రటరీ కమల్ కిరణ్, గౌరవ సలహాదారులు ఆరవ పరిమళ, జిల్లా పబ్లిసిటీ సెక్రటరీ మజార్, సిటీ అధ్యక్షులు ఎస్డీ గౌస్ భాషా, వాకాడు తాలూకా ప్రెసిడెంట్ నాగయ్య, నెల్లూరు రూరల్ జాయింట్ సెక్రటరీ జి.లావణ్య, హెవెన్ శ్రీ తదితరులు ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. నర్సింగ్ విద్యార్థులను మంచిగా తీర్చిదిద్దాలన్నారు.

మేయర్ చేతులమీదుగా నిరాశ్రయులకు అన్నదానం, వస్త్రదానం

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 26 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలోని జాతీయ పట్టణ జీవనోపాధుల నిరాశ్రయులకు ఆశ్రమ కేంద్రంలో గురువారం అన్నదానం, వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని అన్నదానం, వస్త్రాలు అందజేశారు. లబ్బైక్ హాజ్ ఉమ్రా టూర్ అండ్ ట్రావెల్స్ నెల్లూరు స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ మంత్రి డాక్టర్ పి.నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల ఆలోచనల మేరకు నిరాశ్రయులను ఆదుకునే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు చైర్మెన్ అబ్దుల్ అజీజ్ మేయర్‌గా ఉన్న కాలంల ఈ నిరాశ్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అప్పటి నుంచి ఈ కార్యక్రమాలను ప్రతి ఏడాది కొనసాగిస్తు ఉన్నామన్నారు. సేవా కార్యక్రమాల్లో అవకాశం ఉన్న ప్రతి క్కొరూ బాగస్వాములై అవసరాల్లో ఉన్నవారిని ఆదుకునే కార్యక్రమాలను చురుకుగా చేపట్టాలని మేయర్ అకాక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ రాజేశ్వరి, సంస్థ నిర్వాహకులు షబానా, నాయకులు పాల్గొన్నారు.

ఆదూరుపల్లిలో సర్పంచ్ వార్డు సభ్యులకు ఘన సన్మానం

చేజర్ల మార్చి 26 ప్రభాతవార్త : చేజర్ల మండలం ఆదూరుపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ చేవూరు నారాయణమ్మతో పాటు వార్డు సభ్యులు తమ పదవి కాలం 5 సంవత్సరాలు విజయవంతం గా పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ సిపి జడ్‌పిటిసి సభ్యులు పీర్ల పార్థసారది ముఖ్య అతిధులుగా హాజరై సర్పంచ్ వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.గ్రామ సచివాలయం లో జరిగిన ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేవూరు నారాయణమ్మను వార్డు సభ్యులను ప్రత్యేకంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా జడ్‌పిటిసి సభ్యులు పార్థసారది మాట్లాడుతు గత 5 సంవత్సరాల కాలంలో గ్రామాభివృద్ధికి సర్పంచ్ నారాయణమ్మ విశేషంగా కృషి చేశారని పేర్కున్నారు.ఎలాంటి ప్రలో భాలకు లొంగ కుండా ప్రజలు పక్షాన నిలబడి గ్రామ అభ్యున్నతికి కట్టుబడి పనిచేసిన తీరు అభినంద ్నీయ మని కొనియాడారు. గ్రామంలో మౌళిక సదుపాయాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సమ స్యలు పరిషా ్కరం వంటి అంశాలలో సర్పంచ్ వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాదించారని తెలిపారు.గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన గ్రామ సచివాలయ సిబ్బందిని కూడా అభినందించారు.గ్రామ పెద్దలు,స్థానిక నాయకులు ప్రజలు పాల్గొని సర్పంచ్ వార్డు సభ్యులను అభిన ్దించారు. అదికారులు, బి రామయ్య, హరీష్, వైసిపినాయకులు సంకల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పోరేషన్‌లోని ఉద్యోగులకు పదోన్నతలు

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 26 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పేనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు అడెండర్లుగా విధులు నిర్వహిస్తున్న జి.కోటేశ్వరి, ఎస్.విజయ,బి.శివ,ఎం.రంగనా యకులురెడ్డి,టి.నాగయ్య ఐదు మందికి పదోన్నతిపై జూని యర్ సహాయకులుగా నియమిస్తూ నగరపాలకసంస్థ కమిషనర్ వైఓ.నందన్ గురువారం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసి కార్పోరేషన్‌కు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

మార్కాపురం అగ్ని ప్రమాదంలో బుచ్చి వాసి మృతి

బుచ్చి మార్చి 26ప్రభాతవార్త:మార్కాపురం దగ్గర అగ్ని ప్రమాదానికి గురైన బస్సులో బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన వ్యక్తి మృతి చెందారు. పట్టణంలోని పెద్దూరులోని ఇప్పగుంట వారి డొంక కాలనీలో నివాసం ఉంటున్న కత్తి జయ రాములు (55) మృతి చెందారు. ఆయన పని నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ గ్రామా నికి బేల్దార్ కూలీ పనికి వెళ్లినట్లు సమాచారం. ఆయన భార్య బుజ్జిమ్మ ,జనవరిలో ఆనారోగ్యంతో మృతి చెందింది. వీరికి సంతానం లేదు. బుచ్చి పట్టణ ంలోని కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకి తిరిగి స్వగ్రామానికి వచ్చే సమయంలో ఈప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనపై బుచ్చి సిఐ శ్రీనివాసరావు,ఎస్ఐ సంతోష్‌రెడ్డి మృతుడు బంధువులను విచారిస్తున్నారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గునుకుల

నెల్లూరు,మార్చి26 ప్రభాతవార్తవిద్య : సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సోమిరెడ్డి నివాసంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సోమిరెడ్డిని కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. గునుకుల మాట్లాడుతు ప్రజా సమస్యల పరిష్కారం కోసం దశాబ్దాలుగా పోరా టం చేస్తూ అధికారం ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల్లో తిరిగే సోమిరెడ్డి నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. జనసేన నాయకులు ప్రశాంత్‌గౌడ్ తదితరు లుపాల్గొన్నారు.

సరయు హీరోషోరూం నూర్యో వైద్యశిబిరానికి విశేష స్పందన

నెల్లూరు,మార్చి25 ప్రభాతవార్త విద్య : నగరంలోని స్థానిక మినీబైపాస్‌రోడ్డు, రామూర్తి నగర్‌లో గల సరయు హీరో షోరూంలో గురువారం ప్రముఖ న్యూరాలజీ వైద్య నిపుణులు అనుష చే ఏర్పాటుచేసిన నూర్యో వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లబించింది.నగర వాసులు , నూర్యో బాధితులు పెద్ద సంఖ్యలో వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందరర్భంగా సరయుహీరో షోరూం అధినేత అప్పల రాజ్‌కుమార్ మాట్లాడుతు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్యశిబిరం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి అవసరమైన సిబిపి, ఎల్ఎఫ్‌టి, సిరమ్ క్రియాటిన్, ఈఎస్ఆర్, టిఎస్‌హెచ్, ఈసిజి, ఐ పరీక్షలు, డెంటల్ పరీక్షలు, బిఎంఐ పరీక్షలు సుమారు నాలుగువేల ఖరీధు అయ్యే టెస్టులను ఉచితంగా చేశామన్నారు. నగర వాసులు అ అవకాశాని వినియోగించుకోవటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేసిన వారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. షోరూం సిబ్బంది, వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

రాపూరు,మార్చి26ప్రభాతవార్త : రాపూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేది ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు రాపూరు యంపీడీఓ మారెళ్ళ భవాని తెలిపారు. మండల సమావేశ మందిరంలో యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న ఆధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో శాఖాల వారిగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఏప్రిల్ నెల 2వ తేది గ్రామ సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండటంతో వారికి విడ్కోలు కూడా వారిని ఘనంగా సన్మానించి విడ్కోలు తెలుపనున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కావలి, మార్చి 26 ప్రభాతవార్త : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరం కోసం బిటిఏ చేపట్టిన దశల వారీ పోరాటంలో 5వ దశ నిరసనలో భాగంగా జిల్లాశాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు మణిసుబ్బు అధ్యక్షతన గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేశారు.రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు మణిసుబ్బు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు కావస్తున్న ఇంతవరకు ఒక్కసమస్య కూడా పరిష్కరించలేదని తెలిపారు .జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరి ంచకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.మండల అధ్యక్షులు ప్రధాన కార్యద ర్శులు శశి, శివక్రి ష్ణలు మాట్లాడుతూ ఈనెల30న కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయ ప్రదం చేయా లని తెలి పారు .పి.రవి.పి.బాలసుబ్రమణ్యం,2నిర్మల,జనార్ధన్,కోటేశ్వరరావు చిట్టేటిశ్రీనివాసులు,రాజమౌళి,చెక్కా రవి, జ్ఞాన శేఖర్,మురాజ్,మాల్యాద్రి బి.అశోక్,కిషోర్,మాదవ,కొండ లరావు,జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు నియోజకవర్గ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేమరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, మార్చి 27 ప్రభాతవార్త : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోవూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ. సీతారాముల కళ్యాణం ఎంతో పవిత్రమైన శుభదినం అన్నారు. శ్రీరామచంద్రుల వారు ధర్మానికి ప్రతి రూపమైన ఆదర్శ పురుషుడని సీతారాముల కృపా కటాక్షాలతో కోవూరు నియోజకవర్గ ప్రజానీకం అంతా ఆయు రారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కోవూరు నియోజకవర్గంలో ప్రతి ఇల్లు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో వుండాలని కోరారు. శ్రీరాములవారి ఆశయాలు, ఆదర్శాలు నేటితరానికి స్ఫూర్తి కావాలని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్నిఆలయాల్లో జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు.

శ్రీ సాయి దర్బార్‌లో నేత్రపర్వంగా శ్రీరామ కళ్యాణ మహోత్సవం

నెల్లూరు,మార్చి26 ప్రభాతవార్త –విద్య : నేడు నగరంలోని స్ధానిక బాలాజీనగర్,పద్మావతి నగర్‌లోని అద్దాల సాయిబాబా మందిరం(సాయి దర్బార్‌లో) శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకి కాకడ హారతి, 6 గంటలకు సాయినాధుని ప్రత్యేకఅభిషేకాలు చేపట్టారు. 9 గంటలకి 25వ శ్రీ సీతారామ చంద్రుల వారి కళ్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.అర్చక స్వామల వేదమంత్రోశ్చరణలతో, ముత్యాల తలంబ్రాలు, భారీ భక్తజన సందోహం నడుమ శ్రీవారి కళ్యాణోత్సవం నేత్ర పర్వంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని కళ్యాణాన్ని వీక్షించి తరించారు. 12 గంటలని మద్యాహ్న హారతి, 12.30 గంటలకి భారీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే సాయంత్రం 5 గంటలకి సాయం సంధ్యాహారతి, విష్ణుసహస్రనామ పారాయణం, పల్లకి సేవ, వైభవోపేతంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో ముఖ్యఅతిధిగా మదీనా వాచ్స్ ఏజన్సీస్ అధినేత షేక్.ఇంతియాజ్ పాల్గొని స్వామి వారి కళ్యాణోత్సవానికి కావాల్సిన పట్టుపంచె,చీర,గాజులు, పూజా సామాగ్రిలను స్వయంగా నిర్వాహకులకు అందించి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్బంగా ఇంతియాజ్ మాట్లాడుతు కులమతాలకు అతీతంగా ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని కోరారు. ఇటువంటి పవిత్ర కార్యక్రమాల్లో పాలుపంచుకోవటం మిక్కిలి సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు మధుసాయి మాట్లాడుతు శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి విచ్చేసి విజయవంతానికి కృషిచేసిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు , ఆలయ నిర్వాహకులు బాబీ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింటు చింతల లలితమ్మ భర్త మాలకొండయ్య (లేట్) ఇచ్చిన సంజాయిషి మేరకు నా క్లయింటు చింతల లలితమ్మ 22.08.2006వ సం॥మున డాక్యుమెంట్ నెం. 1654/2006 చింతల మాలకొండయ్య గారికి రిజిష్టర్ సెటిల్‌మెంట్ పత్రం ద్వారా చేసిన సెటిల్‌మెంట్ పత్రమును ఈరోజు 26.03.2026 సం॥మున బుచ్చిరెడ్డిపాళెం బస్టాండు జెరాక్స్ సెంటర్ నందు జెరాక్స్ తీయించుటకు పోగా మార్గ మధ్యములో ఒరిజినల్ రిజిష్టర్ సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ పోయినది. కావున ఈ డాక్యుమెంట్ నెం. 1654/2006 ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు ఆస్తి వివరములు:

నెల్లూరు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, బుచ్చిరెడ్డిపాళెం సబ్ రిజిస్ట్రేషన్, బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని మినగల్లు గ్రామ పంచాయతీ ఏరియాలోని మినగల్లు గ్రామ పొలములోని నెం.34 రు పట్టా దాఖలా కోరు మెట్ట స.నెం.140 రులో ఎ 4.05ట్లులో నీకు చెందజేసిన ఎ 3.50ట్లు (లేక) 1.417హె. భూమికి హద్దులు **తూర్పు:** పారుదల కాలువ, **దక్షిణం:** ఆల్తూరు రామిరెడ్డి వగైరాల భూమి, **పడమర:** అరుంధతీయవాడ, **ఉత్తరం:** కోవూరు కాలువ. ఈ హద్దులలోని మూడు ఏకరము లా యాభై సెంట్ల మాగాణి భూమిన్నీ, సదరు భూమికి వాకు గల మామూలు కలక, వులక, నీటి పారుదల సర్వ హక్కులతోటిన్నీ, యీ శెటిల్మెంటు పత్రం ద్వారా యీ దివమే నీకు చెందజేయడమైనది.

ఐ.నరసింహ రావు అడ్వకేట్, బి-12-23, బొంబై రోడ్డు, బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు మం॥, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా. సెల్ 9848414967

ఎన్‌టిఆర్ విగ్రహా ఏర్పాటుకు అనుమతి కోసం వినతి

బుచ్చి మార్చి 26 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలో వవ్వేరు బ్యాంకు సెంటర్‌లో ఎన్ టిఆర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతిని కోరుతు మున్సిఫల్ కమీషనర్ బాలకృష్ణకు టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యాక్షులు ఎం.వి శేషయ్య , టౌన్ గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి ,టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు,జొన్నవాడ దేవస్ధానం మాజీ ఛైర్మన్ పుట్టా సుబ్రవ ణ్యం నాయుడు ,నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణా, వింజం రామానాయుడు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బుచ్చిలో జనసేన వెయ్యి సభ్యత్వాలు

– మండల పార్టీ అధ్యక్షులు మాదవ్

బుచ్చి మార్చి 26 ప్రభాతవార్త : జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం మండలంలో వేగవంతంగా కొనసాగుతున్న జనసేన మండల పార్టీ అధ్యక్షులు డి.మాదవ్‌రావు తెలిపారు. సభ్యత్వ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ఇప్పటికే వెయ్యి సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్ళి సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. యువత మహిళలు పెద్ద సంఖ్యలో ముందు వచ్చి సభ్యత్వం తీసుకుంటున్నారని అన్నారు. పార్టీ సిద్దాంతాలు ,సామాజికి సేవా లక్ష్యాలను ప్రజలకు వివరిస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సామాన్యుల సమస్యల పరిష్కారం,సమాజ మార్పే సేనాని పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ద్యేం అని పేర్కున్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తల కృషి చేయాలని అన్నారు. మండలంలో జనసేనకు పెరుగుతున్న ఆదరణతో స్ధానిక రాజకీయాల్లో చర్చీన్యాంశంగా మారిందని అన్నారు. భవిష్యత్తులో పార్టీ మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

గూడూరు, మార్చి 26, ప్రభాతవార్త : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నాయని ప్రజల కొరకు గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాలలో చలివేంద్రాలు పురపాలక సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలందరూ చలివేంద్రాలను వినియోగించుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్, పాత బస్టాండ్ లో పురపాలక సంఘ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్, ఆర్డీవో సత్యనారాయణ చలివేంద్రాలను ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని ప్రజల దాహార్తి కొరకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే మన ప్రాంతాల్లో వేసవి షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు అక్కడ సేద తీరవచ్చు అని ఎండాకాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం ఆర్డీవో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నివాసాల్లో నుంచి బయటికి రావద్దని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రాబోయే రోజుల్లో ఇంకా పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసులు,హరికుమార్, వైయస్సార్, సురేంద్ర, పెంచలయ్య, నరసింహులు నాయుడు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

28న జడ్పీలో సాధారణ సర్వసభ్య సమావేశాలు

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 26, ప్రభాతవార్త : నెల్లూరు నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న శనివారం సాధారణ సర్వే సమావేశాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా విద్యాశాఖ, ఇతర అధికారిక వ్యవహారాలు ఈ సమీక్షలో నిర్వహిస్తున్నట్టు జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

మార్కాపురం బస్సు ప్రమాదంలో పొదలకూరు వాసి మృతి

పొదలకూరు, మార్చి 26, ప్రభాతవార్త : శ్రీరామనవమి పండుగ అంటే ఆనందం.. కుటుంబం అంతా కలిసే క్షణాలు.. కానీ అదే పండుగ ఒక కుటుంబానికి ఎన్నటికీ మర్చిపోలేని విషాదంగా మార్చింది. ఇంటి వెలుగుగా ఉన్న తండ్రి.. పండుగ కోసం బయలుదేరి శవంగా మారడం పొదలకూరు పంచాయతీలోని తోకంచి గ్రామాన్ని విషాదంలో ముంచింది. మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అనేక కుటుంబాలను కన్నీటి పర్యంతం చేసింది. పొదలకూరు పంచాయతీ పరిధిలోని తోకంచి (వెంకటేశ్వర్ నగర్)కు చెందిన వెంకటేశ్వర్లు ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. జీవనోపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి బేల్దారి పనులు చేసుకునే వెంకటేశ్వర్లు పండుగను కుటుంబంతో గడపాలనే ఆశతో తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. కానీ ఆ ప్రయాణమే అతని జీవితానికి ముగింపు అయింది. సంక్రాంతి తర్వాత జగిత్యాల జిల్లాకు వెళ్లిన వెంకటేశ్వర్లు, ఈసారి పండుగకి తప్పకుండా వస్తా అని ఇంటివారికి చెప్పి బయలుదేరాడు. బంధువులతో కలిసి పామూరు వరకు చేరుకుని..అక్కడి నుంచి పొదలకూరుకు వెళ్లాలని భావించాడు. అయితే కనిగిరి వైపు వస్తున్న బస్సులో ఎక్కిన ఆ క్షణమే.. తన గమ్యం మారిపోతుందని అతడికి తెలియదు. ఆ బస్సు మార్కాపురం వద్ద ప్రమాదానికి గురై అగ్నికి ఆహుతి కావడంతో..అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ జాబితాలో వెంకటేశ్వర్లు ఉండటం.. అతడి కుటుంబానికి ఊహించని దెబ్బగా మారింది. వెంకటేశ్వర్లు సాధారణ కూలీ అయినా..తన కుటుంబానికి మాత్రం బలమైన అండ. ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకుతో అతడి చిన్న ప్రపంచం. పెద్ద కూతురికి పెళ్లి కాగా.. చిన్న కూతురు ఇంకా చదువుకుంటోంది. 18 ఏళ్ల కుమారుడు తండ్రి అడుగుజాడల్లోనే కష్టపడి కుటుంబాన్ని నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ప్రమాద వార్త విన్న వెంటనే భార్య మమత అక్కడికి చేరుకోగా, ఇంటి వద్ద తల్లి, పిల్లలు, బంధువుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి:పండుగకి వస్తానన్నావు.. ఇలా ఎందుకు శవంగా మారావంటూ కుటుంబ సభ్యుల ఆక్రందనలు ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకుతున్నాయి.ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ఒక్క క్షణంలో లేకపోవడం ఎంతటి నష్టం అనే విషాదాన్ని ఈ ఘటన గుర్తు చేసింది. తోకంచి గ్రామం మొత్తం ఈ కుటుంబంతో పాటు దుఃఖంలో మునిగిపోయింది.తండ్రి కోసం ఎదురు చూసిన ఆ ఇంటి గడపలో విషాదాన్ని నింపింది.

జయచంద్రనాయుడు పుట్టిన రోజు సందర్బంగా పేద విద్యార్థులకు బోజనం ఏర్పాటు



కావలి, మార్చి 26 ప్రభాతవార్త : పట్టణం నివాసులు రోహిని అక్వానీడ్స్ అధినేత, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు సంయుక్త సేవా సంస్థ గౌరవ సభ్యులు వేలూరు జయచంద్రనాయుడు పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు గురువారం విందు భోజనం ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సందర్బంగా సేవాసంసథ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ పేద విద్యార్థులకు అన్నదానం, స్వీట్లు, పంపించిన దాత జయచంద్రనాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. ఇలా పేద విద్యార్థులకు అన్నదానం చేసి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సంస్థచే పేదలకు సేవలందిస్తూ ఉన్నారని, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంబగా సంయుక్త సేవాసంస్థ తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటికి బీసీవై పార్టీ కరపత్రాల పంపిణీ, ప్రజలతో చర్చా కార్యక్రమాలు

నెల్లూరు క్రైమ్, మార్చి 26, ప్రభాతవార్త: రాబోయే 2029 ఎన్నికలే లక్ష్యంగా బీసీవై పార్టీ విస్తృత ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు.గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ ఆదేశాలతో ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. ఇంటింటికి బిసివై పార్టీ ద్వారా కరపత్రాల పంపిణీ చేయడంతో పాటు నేరుగా ప్రజలతో చర్చించి బీసీవై పార్టీని గ్రామ గ్రామానికి తీసుకెళుతున్నామని 2029 ఎన్నికల లక్ష్యంగా బీసీవై పార్టీ విస్తృత ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. బీసీ సోదరుల హక్కుల పరిరక్షణ కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేయడానికి సిద్ధపడిన బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ప్రభుత్వానికి చేసిన ఐదు డిమాండ్లను వివరించి ఏప్రిల్ 11వ తేదీన ఆయన చేపట్టబోతున్న ఆమరణ నిరాహార దీక్ష గురించి జిల్లాలోని అన్ని వర్గాలకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు తెలియజేసి కరపత్రం అందజేసి ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు కోరడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలోని గ్రామాలను జోన్లుగా విభజించి ప్రతి జోన్ కు 5 నుంచి 8 మంది ఒక టీము, టీంకు ఒక లీడర్ టీంలో బీసీవై పార్టీ సభ్యులతో పాటు ఒక స్థానిక బీసీ నాయకుడు, ఒక యువకుడు, ఒక మహిళ ప్రతినిధి ప్రతి ఇంటికి వెళ్లి తాము ప్రభుత్వానికి చేసిన ఐదు డిమాండ్లను వివరించి చేపట్టబోతున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు కూడగడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యులు ఎస్ ఎస్ యాదవ్ పాల్గొన్నారు.

అక్రమంగా టపాసుల తయారీ, విక్రయాలపై పోలీసులు దాడులు

దగదర్తి, మార్చి 26, ప్రభాతవార్త : దగదర్తి మండలంలోని కాత్రాయపాడు గ్రామంలో అక్రమంగా టపాసుల తయారీ, నిల్వ, విక్రయా లపై దగదర్తి ఎస్సై జంపాని కుమార్ తన సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఫైర్ క్రాకర్స్, అక్రమ తయారీ నిల్వ, రవాణా, అమ్మకాలపై గట్టి నిఘా ఉంచడం జరిగిందని, బాధ్యులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, టపాసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం స్వాధీనం చేసిన టాపాసుల విలువ రూ.28.075 అని, అక్రమంగా టపాసుల తయారీ , నిల్వ విక్రయాలపై చాలా కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా ఎన్‌బికెఆర్ విద్యార్థులు

కోట, మార్చి 26 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లాలోని మదనపల్లి మిట్స్ కళాశాలలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు (పురుషుల విభాగం) జట్టు విజేతగా నిలిచింది. ఆ మేరకు గురువారం కళాశాలలో డైరెక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు ఆ విద్యా ర్థులను అభినందించారు. విజేతలుగా కృష్ణప్రసాద్, చరణ్‌తేజరెడ్డి, వంశీ, ముకేశ్, శ్రీనివాసులు, పూర్ణచంద్, దేవదాస్, తరుణ్, అభిలాష్, వినయ్‌లు నిలిచారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ పిడి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మానాయుడుపాలెంలో గ్రామసభ

కోట, మార్చి 26 ప్రభాతవార్త : కోట మండలం తిమ్మా నాయుడుపాలెం గ్రామంలో గురువారం తహశీల్దార్ కె.జయజయరావు అధ్యక్షతన వన్‌మంట్ వన్ విలేజ్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ఏమయినా భూ సమస్యలు ఉంటే గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యపై విచారించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే గురుకులాల ప్రధాన లక్ష్యం

కోట, మార్చి 26 ప్రభాతవార్త : ఉత్తమ ఫలితాల సాధనే గురుకులాల ప్రధాన లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల జిల్లా సమన్వయకర్త పద్మజ అన్నారు. గురువారం కోటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను తనిఖీ చేసి రోజూవారి మెనూను పరిశీలించారు. వసతిగృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు కష్టడి చదువుకోవాలని, కష్టపడి చదువుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం గురుకుల విద్యార్థులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి,మోడల్‌స్కూల్లో ఇంటర్ ప్రవేశాలకు దరకాస్తులు

కలిగిరి, మార్చి26, ప్రభాతవార్త; కలిగిరి మోడల్‌స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరకాస్తులు చేసుకోవలసిందిగా కలిగిరి మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ ఎ.శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్ధులు ఇంటర్‌మొదటి సంవత్సరం యంపిసి,బైపిసి,సిఇసి,హెఇసి గ్రూపుల్లో ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు.ఏప్రేల్ 30వ తేదీవరకుదరకాస్తులకుఆన్‌లైన్ ద్వారా స్వీకరించ బడుతాయన్నారు.ప్రతి గ్రూపుల్లోనూ 40సీట్లు మాత్రమేఅందుబాటులో ఉన్నాయన్నారు.ఓసి ,బిసి విద్యార్దులకు దరకాస్తు ఫీజు రు. 200లు ఎస్సీ, ఎస్టీ విద్యార్దులకు దరకాస్తు ఫీజు 150రూపాయలుగా నిర్ణయిం చబడిందన్నారు. అర్హత కలిగిన విద్యార్దులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వేసవి తాపాన్ని తట్టుకునేందుకు చలివేంద్రం .. ప్రజలకు ఉపశమనం

కొడవలూరు, మార్చి 26 ప్రభాతవార్త : వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కొడవలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి కాలంలో ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలుగా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు, తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధిక ఎండలో అవసరమైతేనే బయటకు రావాలని, తగినంత నీరు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి,కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు తొలగించడం అన్యాయం

– బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి – వైసీపీ నేతల డిమాండ్

కోవూరు, మార్చి 26 ప్రభాతవార్త :కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని నేతాజీనగర్ కాలనీ ప్రాంతంలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఉన్న ఇళ్లను బుధవారం జేసీబీతో కూల్చివేశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత వాసులు బుధవారం నుంచి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు గురువారం వైసీపీ నేతలు ధర్నా కార్యక్రమానికి వెళ్లి మహిళలు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న ఇళ్లను ఎటువంటి సమాచారం , నోటీసులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా జేసీబీతో తొలగించడం అన్యాయమన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా వేలాదిమందికి ఇళ్ల పట్టాలు అందజేశారన్నారు. ఇప్పటికైనా ఇళ్లను కూల్చేసిన బాధితులను ప్రభుత్వంగానీ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిగానీ తక్షణమే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. పేద ప్రజలను ఆదుకునేలా పరిపాలన చేయాలే తప్ప వైసీపీ వారిపై కేసులు పెట్టి పరిపాలన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్న వారి ఇళ్లను ఉన్నట్టుండి జేసీబీతో కూల్చివేయడం ఎంతవరకు సబబన్నారు. ఇప్పటికీ ఈ ప్రాంత వాసుల ఇళ్లల్లో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఫొటో పెట్టుకుని పూజలు కూడా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో వారు చేస్తున్న నిరసన కార్యక్రమానికి వైసీపీ పార్టీ మద్దతు పూర్తిసాయిలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాధితులను ఓదార్చి తమ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, జిల్లా కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల సేవాదళ్ అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు, సర్పంచ్ లక్ష్మీకుమారి, మాజీ సర్పంచ్ కె. ఉమా, పార్టీ సీనియర్ నాయకులు అల్లం రాజా, ఉప సర్పంచ్ మోషా, పార్టీ సీనియర్ నాయకులు గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సతీష్, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు సీతారాముల కళ్యాణం

కోవూరు, మార్చి 26 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీ పార్కులో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వా మి దేవస్థానంలో శుక్రవారం శ్రీరామనవమి పుర స్కరించుకుని ఆలయ పునఃనిర్మాణ దాత కాటంరెడ్డి కృష్ణారెడ్డి పెద్ద ఎత్తున సీతారాముల కళ్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చ కులు శ్రీకాం తాచార్యులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరి ంచాలని ఈ సందర్భంగా తెలిపారు. పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలం కరించారు.

చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

కోవూరు, మార్చి 26 ప్రభాతవార్త : కోవూరు మండలం నాయీ బ్రాహ్మణ వీధి, కోనేటి కయ్యలు ప్రాంతాల్లో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులను గురువారం ఆర్‌డ బ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేపట్టే పనులు నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పనులు చేస్తున్న వారికి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, తదితరులు ఉన్నారు.

ఏపీఈఎంసీఎల్ నూతన లోగో ఆవిష్కరణ

కోవూరు, మార్చి 26 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన లోగోను గురువారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఏపీఈఎంసీఎల్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఎంసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌పీ ఖజారియా, తదితరులు ఉన్నారు.

సర్వేపల్లి అభివృద్ధే ఎమ్మెల్యే సోమిరెడ్డి లక్ష్యం

– తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ – కృష్ణపట్నంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి జన్మదిన వేడుకలు

ముత్తుకూరు, మార్చి 26, ప్రభాతవార్త : సర్వేపల్లి అభివృద్ధే ఎమ్మెల్యే సోమిరెడ్డి లక్ష్యమని తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే సోమిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కృష్ణపట్నం హై స్కూల్‌లో విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేసారు. అనంతరం కెక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాగాల శివకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గిరిజనుల సంక్షేమానికి పాటు పడుతూ వారి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని కొనియాడారు. ఆయన మరెన్నో పదవులు రావాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి గోవిందయ్య, వాకాటి చెంగయ్య, పురిమి మహేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి జన్మదిన వేడుకలు

ముత్తుకూరు, మార్చి 26, ప్రభాతవార్త : మండలంలోని బ్రహ్మదేవం పంచాయితీలో ఐటి విభాగ అధ్యక్షులు తిరుమలశెట్టి సతీష్ నాయుడు ఆధ్వర్యంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సోమిరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ప్రభుత్వ పథకాలు అందజేయడంలో నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా భూమిని మేము వదులకోము...ఎమ్మార్పీఎస్‌ను దూషిస్తే ఒప్పుకోం

కావలి, మార్చి 26 ప్రభాతవార్త : కావలి డివిజన్ దగదర్తి మండలం ఉలవపాడు గ్రామంలోని 61/3 సర్వేనెంబర్‌లోని ఒక 1.72సెంట్లు భూమి మాదిగలకు గ్రామ ప్రయోజనం కోసం కేటాయించడం జరిగిందని ఆభూమిపై నకిలీ రిజిష్టర్ కాగితాలు తెచ్చి మా ఆస్తి అంటే అంత తేలిగాగ ఒప్పుకోమని కావలి నియోకవర్గ ఎంఆర్‌పిఎస్ నేతలు హెచ్చరించారు. రైల్వే రోడ్డులోని జర్నలిస్టుక్లబ్‌లో గురువారం ఎంఆర్‌పిఎస్ నాయకులు ఉలవపాడు గ్రామానికి చెందిన మాదిగలు విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు చేవూరు కిరణ్‌కుమార్‌మాదిగ, మంద వెంకటేశ్వర్లు మాదిగ, చేవూరి వరప్రసాద్ మాదిగలు మాట్లాడుతూ మేము ఎప్పుడు అన్యాయానికి వెళ్ళమని తెలిపారు. మాకు సంబంధించిన భూమిని నాగురయ్య, రఫి అనే జలదంకి మండలం జమ్ములపాలెం నుంచి దగదర్తి మండలం ఉలవపాడుకు వలస వచ్చి ప్రభుత్వ భూమిని రిజిష్టర్ చేయించుకున్నామంటూ నకిలీ రిజిష్టర్ పత్రాలు తెచ్చారని తెలిపారు. పై సర్వేనెంబర్‌లోని భూమిని రిజిష్టర్ చేయడం కుదరదు అని ఆదేశాలు ఇచ్చానిట్లు పత్రాలను ఈ సమావేశంలో చూపించారు. ఈ సమావేశంలో ఉలవపాళ్ళ గ్రామ అధ్యక్షులు మంచు తిరుపతి మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు ఏసు పోగు జయరాజ్ మాదిగ, దగదర్తి మండల ఇన్‌చార్జ్ కావలి శ్రీనివాస్ మాదిగ, పట్టణ నాయకులు మావూలురి సల్మాన్ మాదిగ, ఉలవపాళ్ళ ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు కప్పల సుబ్బయ్య మాదిగ, చిన్న వెంకయ్య మాదిగ, చేజర్ల సుబ్బరామయ్య, కప్పల నారాయణ మాదిగలు పాల్గొన్నారు.

ఘనంగా సోమిరెడ్డి జన్మదిన వేడుకలు

వెంకటాచలం మార్చి 26 ప్రభాతవార్త మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. నిరంతరం ప్రజాసేవలో ఉండే మా నాయకుడు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో చే సు కో వా ల ని

ఎమ్మెల్యేచే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

గూడూరు, మార్చి 26, ప్రభాతవార్త గూడూరు పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న ప్రకృతి పిరమిడ్ ధ్యాన మందిరంలో సమ్మ అజీవా ప్రాజెక్టు వారిచే ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ముగిసింది. 120 విద్యార్థిని విద్యార్థులు శిక్షణ పొందారు. వీరికి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ శాంతి నగర్ స్లమ్ ఏరియా అని ఈ ప్రాంతంలో కంప్యూ టర్ ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటుచేసి అనేక మందికి నేర్పించడం సంతోషంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో అనేక నూతన కంపెనీలు వస్తున్నాయని కంప్యూటర్ నేర్చుకున్న వారు జాబ్‌మేళాను వినియోగించుకొని మంచి ఉద్యోగాన్ని సాధించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దేవరాజు, టిడిపి నాయకులు గురవయ్య శివకుమార్, మోహన్, నరసింహుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ప్రారంభమైన కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

బుచ్చి మార్చి 27 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాలెంలోని శ్రీసీతాలక్ష్మణ సమేతుడైన శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో గురువారం నుండి అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. మార్చి 26 నుండి ఏప్రిల్ 5 వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు వారు తెలిపారు. 26 వ తేది అంకురారోపణం, 27 వతేది శ్రీరామవమి రోజు ఉదయం ధ్వజారోహణం, రాత్రికి శేషవాహనం, 28 వ తేది సూర్యప్రభవాహనం, రాత్రికి హంసవాహనం, 29 వతేది యాళివాహనం, 30 వతేది హనుమంతసేవ, 31 వతేది మోహిని అవతారం రాత్రికి గరుడసేవ ఏప్రిల్ ,1 వతేది కళ్యాణం, రాత్రికి గజవాహనోత్సవం, 2 వతేది రథోత్సవం రాత్రికి తెప్పోత్సవం, 3 వతేది అశ్వవాహనోత్సవం, 4 వతేది తిర్చిఉత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణం 5 వతేది ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భక్తులందరు పాల్గోని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఖోకో పోటీలలో తృతయస్థానం సాధించిన కలువాయి టీచర్ రాజా

కలువాయి మార్చి 26 ప్రభాతవార్త మహారాష్ట్రలోని పూనే నగరంలో జరి గిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కోకో పోటోలలో ఆంధ్రప్రదేశ్‌కు కాంస్య పతకం సాదించింది. ఇందులో కలువాయి బివిఎస్ ఆర్ జెడ్పి హెచ్‌ఎస్‌ప్లస్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ .రాజా ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గోని తన ప్రతిభ ద్వారా రాష్ట్రానికి కాంస్యపతకం సాధించారని పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎస్‌డి అబ్బాస్ అలీతెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయు లు రాజా మాట్లాడుతు ఈనెల 19 నుండి 22 వరకు జరిగిన ఖోఖో పోటీ లలో లీగ్ మ్యాచ్‌లలో బెంగుళూరు మద్య ప్రదేశ్ ,పాండేచ్చిరి, జట్టపై విజయం సాధించి క్వార్టర్ పైనల్‌కి చేరామనిఅ న్నారు. క్వార్టర్ పైనల్‌లో ఆర్ ఎస్ బి చెన్నై విజయం సాదించి సెమీ పైనల్‌కి చేరి సెమీ పైనల్‌లో మహా రాష్ట్రతో ఓటమిని చవిచూసి మూడో స్ధానంలో సరిపెట్టుకోవాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు రాజాని స్కూల్ ఉపాధ్యాయులు సిహెచ్ మల్లికార్జునరెడ్డి, పెంచలపుల్లయ్య, విద్యాకమీటి చైర్మన్ మహేష్ సిఆర్‌పి మహేష్, ఇతర ఉపాధ్యా యులు అభినందించారు.

భక్తి శ్రద్దలతో కోదండ రామస్వామి ఆలయంలో ధ్వజారోహణం



చిల్లకూరు, మార్చి 26, ప్రభాతవార్త తమ్మినపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీకోదండ రామస్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు రెండవ రోజు భక్తి శ్రద్ధల మధ్య ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి అమ్మవార్లకు నిత్య కొలువు, నిత్యహోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవారు శేష వాహనంపై కొలువదిరి మాడవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించా రు. అదేవిధంగా భక్తుల వినోదం కోసం జ్వాలాముఖి మహి ళా కళాకోలాట ప్రదర్శన నిర్వహించారు. నికేతన్ నెల్లూరు వారు చిన్నారులచే గొప్ప కూచిపూడి భరతనాట్యం క్లాసికల్ నుత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరీకారంగా తీర్చిదిద్దడం భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ కోట సతీష్ యా దవ్ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గిరికృష్ణ, కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నా రవేద మంత్రోచ్చారణల నడుమ ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.

గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ

తోటపల్లి గూడూరు, మార్చి 26, ప్రభాతవార్త: మండలంలోని ముంగలదొరువు గ్రామంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను తెలుగుదేశం యువనేత మొగలిగుంట పోతన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధ్యన గోపాల్ నాయుడు, గుడ్లూరు గోపాల్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని 20 గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేసి సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోతన మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నాయక త్వంలో గ్రామానికి అనేక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



తోటపల్లిగూడూరు, మార్చి26, ప్రభాతవార్త మండలంలోని నరుకూరు సినిమా హాల్లో, ముంగల దొరువు, కోడూరులో గురువారం వైభవంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి సోమిరెడ్డి జిందాబాద్, తెలుగుదేశం పార్టీ వర్ధిల్లాలి అంటూ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. జన్మదిన వేడుకలలో భాగం గా నోవా బ్లడ్ క్యాంప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారుగా 50 మందికి పైగా రక్త దానం చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షులు కోణతం రఘుబాబు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నాయకత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య దర్శి బొమ్మి సురేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి మన్యం జితేంద్ర గౌడ్, డీసీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, దూదేకుల సంఘం రాష్ట్ర డైరెక్టర్ షేక్ అల్తాఫ్ విజయ డైరీ డైరెక్టర్ వరిగొండ చిన్న బాబిరెడ్డి, తోటపల్లి గూడూరు పేడూరు సొసైటీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గూడూరు నారాయణ, తోటపల్లి రామ్మోహన్ నాయుడు, ముత్యాల శ్రీనివాసులు, ముత్యాల గణేష్, గంగపట్నం సుధీర్, కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు బాబు నాయుడు, కావల్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, వీరబోయిన గంగాధర్, మొగిలిగుంట పోతన, మాగుంట రమణారెడ్డి, సమంత రెడ్డి, పాకం వెంకయ్య, గుడ్లూరు శ్రీధర్ నాయు డు, చావా కోటయ్య నాయుడు, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, తంబిరెడ్డి వెంకటేశ్వర్లు, బైనబోయిన శ్రీనివాసులు, పామంజి రామకృష్ణ, చెరుకూరు పరంధామ నాయుడు, చుక్కపల్లి మల్లికార్జున్ నాయుడు, ధార వెంకటేశ్వర్లు, తదితరులు హాజరయ్యారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు డాక్టర్ కిషోర్స్‌రత్నం విద్యార్థుల ఎంపిక

నెల్లూరు, మార్చి26 ప్రభాతవార్త -విద్య అర్చరీ అసోసియే షన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడ జిల్లా నూజివీడులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో నెల్లూరునగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.మోక్ష ఇండియన్ విభాగంలో, అలాగే 7వ తరగతి చదు వుతున్న పి.భావజ్ఞ హంసిని రికర్వ్ రౌండ్‌లో ఉత్తమ ప్రతిబ కనపరిచి జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికై సత్తా చాటారు. ఈ సందర్భంగా స్దానిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు అబినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల జిఎం రామూర్తి నాయుడు విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతు తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలిచి 27,28 తేదీల్లో గుంటూరు జిల్లా నంబూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన వీరు జాతీయస్దాయిలో కూడా విజయం సాధించాలని కోరారు. విద్యార్ధులు ఆర్చరీలో రాణించటంపట్ల తమ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు హర్షం వ్యక్తంచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం

ముత్తుకూరు, మార్చి 26, ప్రభాతవార్త మండలంలోని పిడతాపోలూరు ఎంపిడిఓ కార్యాలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా టిడిపి నాయకులు దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిభిరం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దండు శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. ఇటువంటి మరెన్నో జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే సోమిరెడ్డి జరుపుకోవాలని ఆయన ఆయురారోగ్యంగా ఉండాలని ఆయన దేవున్ని ప్రార్ధించిన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని అన్నారు. రక్తదానం చేసి దండు శ్రీనివాసులను మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేలటూరు పంచాయితీలో ఘనంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ముత్తుకూరు, మార్చి 26, ప్రభాతవార్త మండలంలోని నేలటూరు పంచాయితీలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు మొద్దు సురేష్, ఉడతా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. మాట్లాడు తూ సర్వేపల్లిని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే సోమిరెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి జన్మదినం కావడంతో నేలటూరు పంచాయితీలో పలు చోట్ల సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రవేంద్ర, స్ధానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు, మార్చి26 ప్రభాతవార్త -విద్య రాష్ట్రంలోని ప్రైవేట్ ,బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్క రించాలని అపస్మా జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు విషయంలో ప్రొసీడింగ్స్ ఇవ్వకముందే నియమాలు తెలయజేయకుండానే జిల్లా విద్యాశాఖ అధికారి లాగిన్ నుండి ప్రధానోపాధ్యాయులకు ఫైల్స్ తిప్పి పంపించటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పాఠశాలల గుర్తింపు రెన్యువల్స్ 10 సంవత్సరాలు చేశారని, అయితే గత ప్రభుత్వంలో అనుమతులు తీసుకున్న వారికి రెండు సంవత్సరాలు రెన్యువల్స్ చేయాలని కోరారు. బడ్జెట్ పాఠశాలల నిర్వాహకులు సుమారు 3000వేల మందికి పైగా రేకుల షెడ్డుల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నారని, వారికి రెన్యువల్స్ ఇవ్వటం లేదన్నారు. అలాగే గత 30 సంవత్సరాలుగా పాఠశాల నిర్వహిస్తున్న వారికి ప్రస్తుతం అధికారులు ఎన్‌ఓసి తీసుకురావాలని ఒత్తిడి చేయటం విడ్డూరంగా ఉందన్నారు. కరెంటు బిల్లులను డొమెస్టిక్‌లోనే ఉండాలని కోరారు. అలాగే నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో పాఠశాలలకు కొత్తగా అడ్వర్టైజింగ్ టాక్స్ పేరుతో సాధారణ బోర్డుకు రూ.3000, లైటింగ్ బోర్డుకు రూ.6000వేలు కట్టాలని కమిషనర్ నోటీసులు ఇస్తున్నారని, ట్రేడ్ లైసెన్స్ కలిగిన తమకు తమ స్థలాల్లో బోర్డు పెట్టుకునే అధికారం ఉందని తెలిపారు. వెంటనే ఆయా సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని ఆయన కోరారు.

హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో తాజా అభివృద్ధులు

- మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్ జయరామ్

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త -వైద్యం హార్ట్ ఫెయిల్యూర్ అనేది గుండె శక్తి తగ్గిపోవడం వల్ల శరీరానికి అవసరమైన రక్తాన్ని సరైన విధంగా పంపించలేని స్థితి. ఇది ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా మారింది. ముఖ్యంగా దయాబెటిస్, హైపర్‌టెన్షన్, జీవ నశైలి మార్పుల వల్ల దీని ప్రబలత పెరుగుతోంది. అయితే గత కొన్ని సంవత్సలలో హార్ట్ ఫెయిల్యూర్ నిరాధరణ, చికిత్సలో గణనీయమైన అభివృ ద్ధులు చోటుచేసుకున్నాయి. ఇటీవల కాలంలో ఔషధ చికిత్సలో జరిగిన మా ర్పులు హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా ఎస్‌జీఎల్‌టీ2 ఇన్హిబిటర్స్, ఏఆర్‌ఎన్‌ఐ మరియు మినరల్ కార్డియిడ్ రిసెప్టర్ నిరోధకాలు వంటి మందులు రోగులలో మరణాల రేటును తగ్గించడమే కాకుండా, హాస్పిటల్ అడ్మిషన్లను కూడా తగ్గిస్తున్నాయి. ఈ మందులు ఇప్పుడు హార్ట్ ఫెయిల్యూర్ చికిత్సలో స్టాండర్డ్ థెరపీగా మారుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) వినియోగం కూడా కార్డియాలజీలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తోంది. ఎకోకార్డియోగ్రఫీ ద్వారా గుండె పనితీరును ఆటోమేటిక్‌గా విశ్లేషించడం, రోగి ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేయడం వంటి అంశాలలో ఏఐ కీలకంగా మారుతోంది. దీని వల్ల హార్ట్ ఫెయిల్యూర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం సాధ్యమవుతోంది. రిమోట్ మానిటరింగ్ , టెలీమెడిసిన్ వినియోగం కూడా పెరుగుతోంది. వేరబుల్ డివైసులు, ఇంప్లాంటబుల్ సెన్సార్ల ద్వారా రోగి గుండె పరిస్థితిని నిరంతరం పరిశీలించడం సాధ్యమవుతుంది. దీని వల్ల సమస్యలు ముందుగానే గుర్తించి చికిత్స అందించడం వల్ల హాస్పిటల్ రీ అడ్మిషన్ రేటుతగ్గుతోంది. పర్స నలైజ్డ్ మెడిసిన్ కూడా హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో ఒక ముఖ్యమైన దిశగా అభివృద్ధి చెందుతోంది. జెనిటిక్ టెస్టింగ్, బయోమార్కర్‌ల ఆధారంగా ప్రతి రోగికి ప్రత్యేకంగా చికిత్సను రూపొందించడం వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడుతున్నాయి. ఇది భవిష్యత్తులో హార్ట్ ఫెయిల్యూర్ కేర్‌లో ప్రధాన పాత్ర పోషించనుంది. అదే విధంగా, స్టెమ్ సెల్‌థెరఫీ, రీజెనరేటివ్ మెడిసిన్ రంగంలో జరుగుతున్న పరిశోధనలు గుండె కణజాలాన్ని పునరుద్దరించేందుకు కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. ఇంకా ఈ విధానాలు పూర్తిగా సాధారణ ప్రాక్టీస్‌లోకి రాకపోయినా, భవిష్యత్తులో ఇవి గేమ్ చేంజర్‌గా మారే అవకాశం ఉంది. తీవ్రమైన హార్ట్ ఫెయిల్యూర్ కేసుల్లో అడ్వాన్స్‌డ్ డివైస్‌తెరఫీలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఎల్‌వీఏడీస్, ఐసీడీస్, కార్డియాక్ రీసింక్రోనైజేషన్ థెరపీ(డీఆర్‌టీ) వంటి డివైసులు రోగుల జీవనకాలాన్ని పెంచడంలో సహాయపడుతున్నాయి. తీవ్రమైన కేసుల్లో ప్రాణాలను కాపాడుతున్నాయి. మొత్తానికి, హార్ట్ ఫెయిల్యూర్ నిర్వహణలో జరిగిన ఈ అభివృద్దులు వైద్య రంగంలో ఒక కొత్త దశను ప్రారంభించాయి. ఆధునిక ఔషధాలు, సాంకేతికత, వ్యక్తిగతీకరించిన చికిత్సల సమన్వయం ద్వారా రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడం సాధ్యమవుతోంది. భవిష్యత్తులో ఈ అభివృద్దులు మరింత విస్తరించి హార్ట్ ఫెయిల్యూర్‌ను సమర్ధవంతంగా నియంత్రించే దిశగా దోహదపడతాయి.

జిల్లాకు నూతనంగా 9 పశు ఔషధి విక్రయ కేంద్రాలు మంజూరు : జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 26, ప్రభాతవార్త: జిల్లాకు నూతనంగా 9 పశు ఔషధి విక్రయ కేంద్రాలు మంజూరైనట్లు జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్ల తెలిపారు. గురువారం కలెక్టర్ వారి చాంబర్‌లో పశుసంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిల్లాకు నూతనంగా మంజూరు చేసిన 9 పశు ఔషధి విక్రయ కేంద్రాలను త్వరగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రాల ద్వారా గేదేలు, మేకలు, గొర్రెలు తదితర పశువులకు, కోళ్లకు సంబంధించి 25 నుంచి 50 శాతం రాయితీపై మందులను అందించనున్నట్లు చెప్పారు. జిల్లాలో నెల్లూరు సిటీ, ఉదయగిరి, వెంకటగిరి, కావలి, ఆత్మకూరు, ఆత్మకూరు, కావలి, వెంకటగిరి, సూళ్లూరుపేటలోని పశు వైద్యశాలల్లో ఈ పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్, ఎడి మాధవీలత, డిసివో గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలి
- జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 26, ప్రభాతవార్త 18 సంవత్స రాలు దాటిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్లోని డిఆర్‌వోచాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. డిఆర్‌వో విజయ్ కుమార్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బందితో పాటు పార్టీల ప్రతినిధులు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫారం 6లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫారం 6లను సంపూర్ణంగా పూర్తిచేసే విధంగా రాజకీయపార్టీల ప్రతినిధులు నూతన ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. అదే విధంగా రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. టిడిపి రసూల్, వైఎంఆర్‌సిపి వెంకట శేషయ్య, బిజెపి శ్రీనివాసులు, కాంగ్రెస్ కె.సంజయ్ తదితరులు హాజరయ్యారు.

రైతు రాజ్యం కాదు.. దళారుల రాజ్యం

- వైసీపీ నాయకుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి

కోట, మార్చి 26 ప్రభాతవార్త ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతురాజ్యం నడవడం లేదని, దళారుల రాజ్యం నడుస్తోందని వైసీపీ నాయకుడు, పుచ్చలపల్లి జల సంఘం మాజీ అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన దొరువుకట్టలో తన నివాసం వద్ద 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. దళారులే రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. పేరుకు మాత్రం ధాన్యం కొను గోలు చేస్తున్నాం, కేంద్రాలు ఏర్పాటు చేశామంటూ ఆర్భాటంగా మంత్రుల నుంచి ఎమ్మెల్యేల వరకు మాటలు చెప్పడం తప్ప ఆచరణలో అమలు కావడం లేదన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రైతులను గురించి ఒక్క ఎమ్మెల్యే గాని, మంత్రి గాని మాట్లాడకపోవడం దారుణమన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవస్థలు నిర్వీర్యమైపోయాయన్నారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

గాదిరాజును పరామర్శించిన ఎమ్మెల్యే కావ్య

కోవూరు, మార్చి 26 ప్రభాతవార్త : కోవూరు మండలానికి చెందిన డీలర్ గాదిరాజు నీరజాక్షరావు ఇటీవల చెన్నై అపోలో హాస్పిటల్‌లో సర్జరీ చేయించుకుని నెల్లూరులోని కుమారుడు నివాసంలో ఉంటున్నాడు. ఈ మేరకు గురువారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నీరజాక్షరావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఈసమయంలోనే విశ్రాంతి తీసుకోవాలని నీరజాక్షరావుకు సూ చించారు. ఈ కార్యక్రమంలో వాయిస్ 5 న్యూస్ చానెల్ సీఈవో గాదిరాజు వినోద్‌కుమార్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

రైస్ మిల్లర్లు పూర్తిస్థాయిలో సహకరించాలి

కోవూరు, మార్చి 26 ప్రభాతవార్త : కోవూరు మండలంలో ప్రస్తుతం వరికోతలు పూర్తిస్థాయిలో ప్రారంభం అయ్యాయని ఈ పరిస్థితుల్లో మిల్లర్లు రైతులకు సహకరించాలనిమండల ప్రత్యేక అధికారి, మార్క్‌ఫెడ్ ఏడీ అనిత అన్నారు. అన్నారు. కోవూరు మండలంలోని పలు రైస్ మిల్లులను గురువారం పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైస్ మిల్లు తప్పనిసరిగా బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చి సీఎంఆర్ ద్వారా ధాన్యంను సేకరించాలన్నారు. అదేవిధంగా రైతులకు అవసరమైన గోతాలను సకాలంలో అందించేలా రైస్ మిల్లర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రైస్ మిల్లులో వీఆర్వోలను ఏర్పాటుచేసి వారి ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. లారీ ల్లో, ట్రాక్టర్లలో ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా సకాలంలో దానికి అన్‌లోడ్ చేసేలా మిల్లర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి, పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఆమె వెంట కోవూరు తహాసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య,, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహాసీల్దార్ బాలకోటమ్మ, తదితరులు ఉన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మెన్ అబ్దుల్ అజీజ్‌ని పరామర్శించిన ఎమ్మెల్యే

కావలి, మార్చి 26 ప్రభాతవార్త : ఏపి వక్ఫ్ బోర్డు ఛైర్మెన్, టిడిపి మాజీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తల్లి ఇటీవల మృతి చెందడం జరిగింది. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గురువారం నెల్లూరులోని అబ్దుల్ అజీజ్ నివాసానికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వారి కటుంబసభ్యులను కలసి తన ప్రగాడ సానుభూతి తెలిపారు. కావలి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యఓఉలు షేక్ ఆల్‌హర్, టిడిపి నాయకులు రేబాల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

నెల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త శ్రీరామ మార్గం ధర్మమార్గమని, ఆయన మార్గంలో నడిచినవారికి శ్రీరాముడి ఆశీసులు ఎల్లవేళలా ఉంటాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియ జేశారు. రాముడు ధైర్యానికి, పితృవాక్కు పాలనకు, శాంతికి ప్రతీక అని, ఎటువంటి విపత్కర పరిస్థి తులలో అయినా సత్యానిష్ఠలతో జీవించాలన్న శ్రీరాములవారి సుగుణాలు నేటి సమాజానికి ఆదర్శం కావా లని ఆయనఆకాంక్షించారు. శ్రీరాముడి కృప ప్రతి ఇంట ఆనందంతో నింపాలని, అన్ని శుభాలు కలగా లని కోరారు. రాముడి ఆశీస్సులతో అందరిజీవితంలోశాంతి, ఆరోగ్యం ధనసమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.